సాక్షి తిరుపతి

మంగళవారం । 7 । మార్చి । 2023



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.57,870
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,169
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.66,300
రిటైల్ వెండి గ్రాము	రూ.68.30

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	18
చిత్తూరు	34	18
తిరుమల	31	14
గూడూరు	34	21
నగరి	36	20



విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

క్రీడల్లోనూ రాణించాలని జేఎన్‌టీయూ అనంతపురం వైస్ చాన్స్‌లర్ రంగజనార్దన్ తెలిపారు. గూడూరులో జరిగిన యూనివర్సిటీ 11వ అంతర కళాశాలల గేమ్స్‌మీట్ సోమవారం ముగిసింది.

-8లో..

న్యూస్‌రీల్

నిషేధిత వస్తువులపై ఉక్కు పాదం



మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైమ్: జిల్లాలో నిషేధిత వస్తువులపై ఉక్కు పాదం మోపాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం పోలీసు అతిథిగృహంలో ఆయన సెబ్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, కాలేజీల ముందు జులాయిగా తిరిగే అల్లరిమూకలపై దృష్టిపెట్టాలన్నారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు ఎంతమంది సిబ్బందిని ఇవ్వడానికైనా పోలీస్‌శాఖ సిద్ధంగా ఉందన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఎస్పీ చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. సెబ్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, ఎక్సైజ్ సూపరింటెండ్ డాక్టర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 57 ఫిర్యాదులు



ఫిర్యాదును స్వీకరించిన ఏఎస్పీ వెంకటరావు

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 57 ఫిర్యాదులు అందినట్టు ఏఎస్పీ వెంకటరావు తెలిపారు. ఇందులో భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువ సంఖ్యలో వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. వెంటనే వాటిని పరిష్కరించేలా సిబ్బంది చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

నేడు కుమారధార తీర్థ ముక్కోటి

- విస్తృత ఏర్పాట్లు చేపట్టిన టీటీడీ

తిరుమల: తిరుమలలో శ్రీకుమారధార తీర్థముక్కోటికి సర్వం సిద్ధమైంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ భారీ ఏర్పాట్లు చేపట్టింది. భక్తులను ఉదయం 6 నుంచి తీర్థానికి అనుమతించనుంది. కుమారధార తీర్థం ముక్కోటికి వెళ్లే భక్తులకు డ్యామ్ వద్ద అన్నప్రసాదం, జలప్రసాదం అందించేలా ఏర్పాట్లు చేపట్టింది. దాదాపు 300 మంది విజిలెన్స్, పోలీస్, ఫారెస్ట్ సిబ్బందిని కేటాయించింది. రోగులు, వృద్ధులు, చిన్నపిల్లలు ట్రెక్కింగ్ చేయవద్దని సూచించింది. మధ్యాహ్నం 12 గంటల తర్వాత పాప వినాశనం నుంచి కుమారధార తీర్థ ప్రవేశం మార్గం మూసివేయనున్నట్టు వెల్లడించింది. ఇదిలావుండగా శ్రీకుమారధారతీర్థ ముక్కోటి ఏర్పాట్లపై సోమవారం ఉదయం పీఏసీ-4లో టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. తిరుమల వీజీఓలు బాలిరెడ్డి, గిరిధర్, తిరుమల డీఎస్పీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో ఇంటర్ డిసిప్లినరీ లైఫ్ సైన్స్ ప్రోగ్రాం ఫర్ అడ్వాన్స్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ కింద ఏడాది కాలం ప్రాజెక్టు అసోసియేట్‌గా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎ.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. పనితీరు అంచనా/ మూల్యాంకనం ఆధారంగా తరువాతి ఏడాదికి పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. నెలకు రూ.25 వేలు, అలాగే 8 శాతం హెచ్‌ఆర్‌ఏ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు పూర్తి సమాచారానికి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్‌పీఎంవీవీ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని, అలాగే ఏవైనా సందేహాలకు 93938 67573 నంబరులో సంప్రదించవచ్చని ఆమె సూచించారు.

అభ్యంతరాలు తెలపండి

తిరుపతి అర్బన్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో గ్రామ పంచాయతీ ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా అందుబాటులో ఉంచామని, అభ్యంతరాలుంటే సంబంధిత ఎంపీడీఓ, ఈఓపీఆర్డీకి తెలియజేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. వాటిపై ఈనెల 9న విచారణ, 10న తుది పోలింగ్ కేంద్రాల జాబితా సిద్ధం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

నేడు సత్యనారాయణస్వామి వ్రతం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధమైన వరదరాజస్వామి గుడిలో మంగళవారం పౌర్ణమిని పురస్కరించుకుని సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నారు. సోమవారం ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే వ్రతంలో భక్తులు పాల్గొనవచ్చని తెలిపారు.

అటు సన్నద్ధం.. ఇటు ప్రచారం

ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు, నేతలు బిజీబిజీగా మారారు. ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమవగా.. రాజకీయ పార్టీల నేతలు ప్రచారపర్వంలో తలమునకలై పోయారు. అధికారపార్టీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేశారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల వద్దకెళ్లి నేరుగా ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ప్రభుత్వ పథకాలను, చేపట్టబోయే కార్యక్రమాలను వివరిస్తూ దూసుకుపోతున్నారు. మరో వైపు విపక్ష పార్టీల నేతలు ఫోన్ వాయిస్‌లు, మెసేజ్‌లకే పరిమితమయ్యారు.

ఓజిలి: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



బుచ్చినాయుడుకండ్రిగ: కరపత్రాలు పంపిణీ చేస్తున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల వేడి
- ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ నేతలు
- ప్రభుత్వ పథకాలను వివరిస్తూ... ఓట్లను అభ్యర్థిస్తూ ముందుకు
- మరో వైపు ఎన్నికల ఏర్పాట్లలో అధికారయంత్రాంగం బిజీబిజీ



బ్యాలెట్ బాక్సుల పరిశీలనలో రిటర్నింగ్ అధికారి హరినారాయణన్, జేసీ, ఎస్పీ

సాక్షి, తిరుపతి: ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు– చిత్తూరు పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల వేడి రాజుకుంది. ఈనెల 13న జరగనున్న ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖరరెడ్డి ప్రచారాల్లో ముందువరుసలో ఉన్నారు. వీరికి మద్దతుగా మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ప్రచారంలో దూసుకుపోతున్నారు.



ఎన్నికల ఏర్పాట్లలో సిబ్బంది

- పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని పులిచర్ల మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సోమవారం ప్రచారం నిర్వహించారు.
- తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో అన్ని వార్డుల్లో కార్పొరేటర్లు ప్రచారం చేశారు.
- సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో ఓజిలి మండలంలో విస్తృత ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో సూళ్లూరుపేటటౌన్ ప్రెసిడెంట్ కళత్తూరు శేఖరరెడ్డి, దేవేందర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.
- సత్యవేడు నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే ఆదిమూలం బీఎన్ కండ్రిగ, వరదయ్యపాళెం మండలాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బ్యాలెట్ బాక్సులు సిద్ధం

ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల విధానంలో జరగనున్నాయి. ఈ ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులను అధికారయంత్రాంగం సిద్ధం చేసింది. ఇప్పటికే ఆయా జిల్లాల్లో తహసీల్దార్ల వద్దకు బ్యాలెట్ బాక్సులు చేరాయి. ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలను నిర్వహించేందుకు ఆయా జిల్లాల అధికార యంత్రాంగం నిమగ్నమైంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు హరినారాయణన్, వెంకటరమణారెడ్డి, ఎస్పీలు రిశాంత్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల సంఘం జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం పోలింగ్‌కు కౌంట్ డౌన్ మొదలు కావడంతో అధికారులు బిజీబిజీగా ఉన్నారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్‌పేపర్లు, విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ, ఓటర్ స్లిప్పుల పంపిణీ, స్ట్రాంగ్‌రూంల ఏర్పాట్లు తదితర అంశాలు ప్రణాళిక ప్రకారం చేపడుతున్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు

ఎన్నికల పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా సమస్యాత్మక కేంద్రాలను గురించి ఆయా ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. ఆయా జిల్లాల ఎస్పీల పర్యవేక్షణలో బందోబస్తు ప్రణాళికను రూపొందించింది. అడిషనల్ ఎస్పీలు, నలుగురు డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులను ఎన్నికల ప్రక్రియకు వినియోగించనుంది. వీరితో పాటు మొబైల్ పార్టీ బృందాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, ఎంసీసీ టీంలు, స్టాటిక్ సర్వేలెన్స్ టీంలు, ఇతర ఫోర్సులను వినియోంచేలా ప్రణాళిక రూపొందించారు.

మొత్తం 629 పోలింగ్ కేంద్రాలు

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పట్టభద్రుల ఎన్నికలకు 453 పోలింగ్ కేంద్రాలు, టీచర్స్‌కు 176 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టభద్రుల ఎన్నికలకు అన్నమయ్య జిల్లాలో 29, బాపట్లలో 27, చిత్తూరులో 69, ప్రకాశంలో 98, నెల్లూరులో 129, తిరుపతిలో 101 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. టీచర్స్ ఎన్నికలకు అన్నమయ్య జిల్లాలో 15, బాపట్లలో 13, చిత్తూరులో 31, ప్రకాశంలో 40, నెల్లూరులో 40, తిరుపతిలో 37 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఆయా పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని రిటర్నింగ్ అధికారి హరినారాయణన్ అన్ని జిల్లాల డీఆర్‌ఓ, ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు.

జిల్లా సమాచారం

పట్టభద్రుల ఓటర్లు	: 3,81,181
ఉపాధ్యాయ ఓటర్లు	: 27,694
పోలింగ్ కేంద్రాలు	: 629
పట్టభద్రుల ఓటర్ల కోసం	: 453
ఉపాధ్యాయ ఓటర్ల కోసం	: 176

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు

వైఎస్సార్‌సీపీ	- పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి
టీడీపీ	- కంచర్ల శ్రీకాంత్
పీడీఎఫ్	- మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి
బీజేపీ	- సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు

వైఎస్సార్‌సీపీ	- పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి
టీడీపీ	- పోటీలో ఎవ్వరూ లేరు
పీడీఎఫ్	- బాబురెడ్డి
బీజేపీ అనుబంధం	- బ్రహ్మానందం



సూచనలు అందిస్తున్న తిరుపతి కలెక్టర్ వెంకటరమణారెడ్డి

మహిళా సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు

తిరుపతి క్రైమ్: ఈనెల 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజులపాటు మహిళలకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మహిళల ఆరోగ్య భద్రత కోసం హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళల కోసం టాటా ట్రస్ట్ అండ్ టాటా స్వీకర్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే దంత పరీక్షలు చేయిస్తున్నట్టు పేర్కొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న బస్సు వద్ద ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితో పాటు సిబ్బంది

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక కంట్రోల్ రూమ్

తిరుపతి అలిపిరి: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఈనెల 31 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో వివిధ విభాగాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. టీటీడీ పరిపాలనా భవనంలో సోమవారం ఆయన ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జేఈఓ మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదీన శ్రీ కోదండరామస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. కల్యాణం అనంతరం ప్రతి భక్తుడికీ అక్షింతలు, కంకణాలు, పసుపు, కుంకుమ అందేలా ఏర్పాట్లు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. సమీక్షలో ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్ కుమార్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, సీఏవో శేష శైలేంద్ర, ఆలయ డెప్యూటీ ఈవో నటేష్ బాబు, డీఎఫ్‌వో శ్రీనివాస్, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జేఈవో వీరబ్రహ్మం

మెజారిటీ లక్ష్యంగా ముందడుగు

నగరి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా కృషి వేయాలని మంత్రి ఆర్‌కే రోజా పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సత్రవాడలో ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటికి మద్దతుగా మంత్రి ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి గ్రాడ్యుయేట్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. మంత్రి రోజా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమపాళ్లలో అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ బలపరచిన శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించుకోవడం ద్వారా పట్టభద్రులవాణిని శాసనమండలిలో వినిపించవచ్చని సూచించారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా నేత అనుబంధ సంఘం అధ్యక్షుడు కన్నాయిరం, పార్టీ మున్సిపల్ కన్వీనర్ బీఆర్వీ అయ్యప్పన్, నాయకులు కోదండరామిరెడ్డి, ఎస్‌జీ అయ్యప్ప, నాగప్ప, మురుగేశన్, నిత్యానందం, కన్నియప్పన్, వినాయగన్, శ్రీనివాసన్, మురుగేశన్, నాగప్ప, లింగన్, హరిదాస్, కరుణాకరన్, నాగలింగం, తంగమణి, జగన్నాథం పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టభద్రులతో మంత్రి రోజా

పట్టభద్రుల సమస్యలకు పరిష్కారం

వి.కోట: వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించుంటే గ్రాడ్యుయేట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మండలంలోని పాముగాని పల్లె పంచాయతీలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి మంచి మెజారిటీని అందించాలని కోరారు. అనంతరం స్థానిక నేతలతో ఓటర్ల వివరాలపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జిల నియామకం

సాక్షి, తిరుపతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల జోనల్ ఇన్‌చార్జిలను నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆమేరకు తిరుపతి, వైఎస్సార్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలకు రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జిగా మావులూరి శ్రీనివాసులు రెడ్డి నియమితులయ్యారు. బీసీ సెల్ రీజనల్ ఇన్‌చార్జిగా తొండమల్ల పుల్లయ్య, వైఎస్సార్‌టీయూసీకి నారపరెడ్డి రాజారెడ్డి, పంచాయతీరాజ్ విభాగానికి చీర్ల సురేష్‌యాదవ్, ఎస్టీ సెల్‌కు చెవ్వురు పద్మ, మైనారిటీ సెల్‌కు సయ్యద్ హంజా హుస్సేని, విద్యార్థి విభాగానికి లెక్కల రాజశేఖర్ రెడ్డి, వికలాంగుల విభాగానికి కొమ్మిరెడ్డి శివారెడ్డి, వైఎస్సార్ సేవాదళ్‌కు షేక్ మహ్మద్ రఫీ, వైద్యుల విభాగానికి డాక్టర్ అమీర్ బాషా, వాణిజ్య విభాగానికి చందోలు సతీష్, యువజన విభాగానికి మోహిత్‌రెడ్డి, సాంస్కృతిక విభాగానికి ఎస్.కృష్ణవేణి, ప్రచార విభాగానికి డి. బీరేంద్రవర్మ, మహిళా విభాగానికి రత్నకుమారి, గ్రీవెన్స్ సెల్‌కు పోకల రామకృష్ణారెడ్డి, వీవర్స్ వింగ్‌కు మిద్దెల హరి జోనల్ ఇన్‌చార్జిలుగా నియమితులయ్యారు.

నాక్ కమిటీ సందర్శనకు ఎస్వీయూ సిద్ధం

- నేటి నుంచి మూడు రోజుల పర్యటన
- వీసీ ప్రొఫెసర్ కే.రాజారెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: నాక్ ఉత్తమ గ్రేడ్ ర్యాంకు సాధనే లక్ష్యంగా శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీలో సకల సౌకర్యాలు, వసతులు కల్పించినట్లు వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కే.రాజారెడ్డి తెలిపారు. వర్సిటీలోని వీసీ చాంబర్‌లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గతంలో వర్సిటీ మూడు పర్యాయాలు మంచి గ్రేడ్లు సాధించిందని, 2017లో ఏ ప్లస్ సాధించిందని తెలిపారు. ఐదేళ్ల తర్వాత నియమానుసారం ఒక చైర్మన్, ఏడుగురు సభ్యులతో కూడిన నాక్‌పీర్ కమిటీ ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు ఎస్వీయూను సందర్శించనున్నట్లు వెల్లడించారు. బోధన, పరిశోధన, అవస్థాపన సౌకర్యాలు, సామాజిక బాధ్యత, ఉద్యోగ పరికల్పన, ఉత్తమ ఫలితాలు వంటి అంశాల్లో ఎస్వీయూ ఇదివరకే మంచి ర్యాంకులను సాధించినట్లు పేర్కొన్నారు. వాటి ప్రతిఫలాలు నాక్ ఉత్తమ గ్రేడ్ సాధించే దిశగా విశ్వవిద్యాలయం అడుగులు వేస్తోందని, వర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బంది కృషి, సహకారం అభినందనీయని తెలిపారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ వర్సిటీలోని 54 శాఖల ద్వారా విద్యార్థులకు 88 కోర్సులు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. వీటన్నింటిని నాక్ కమిటీ పరిగణలోకి తీసుకోనున్నట్లు తెలిపారు. హెచ్ ఇండెక్స్, స్కోపస్ వంటి పరిశోధన సూచీలలో రాష్ట్రంలోనే ఎస్వీయూ ముందు వరుసలో ఉందన్నారు. సమావేశంలో ఎస్వీయూ నాక్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాసులు రెడ్డి, ప్రొఫెసర్ దామోదరరెడ్డి, రత్నాకర్, కుసుమహరినాథ్, రామిరెడ్డి, పీసీ.వెంకటేశ్వర్లు, నాక్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ రాజారెడ్డి





తెప్పోత్సాహం

తిరుమల శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలు శోభాయమానంగా సాగుతున్నాయి. సోమవారం నాలుగోరోజు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామివారు పుష్కరిణిలో జల విహారం చేశారు. ఐదు పర్యాయాలు ప్రదక్షిణలు చేస్తూ భక్తులను అనుగ్రహించారు. - తిరుమల

క్లుప్తంగా

పకడ్బందీగా బ్యాలెట్ పేపర్ల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్లను సోమవారం కలెక్టరేట్‌లో పకడ్బందీగా పంపిణీ చేశారు. ప్రకాశం, బాపట్ల, అన్నమయ్య, తిరుపతి, నెల్లూరు జిల్లాలకు పటిష్ట బందోబస్తు నడుమ తరలించారు. చిత్తూరు జిల్లాకు సంబంధించిన పట్టభద్రుల, టీచర్ బ్యాలెట్ పేపర్లను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ట్రంక్ బాక్సుల్లో పెట్టి సీల్ చేసి ఆయా రెవెన్యూ డివిజన్లకు చేర్చారు. ప్రక్రియను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షించారు.

లిక్విడేటర్‌గా రవిచంద్రన్

చిత్తూరు అగ్రికల్చర్ : చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ లిక్విడేటర్‌గా రవిచంద్రన్‌ను నియమిస్తూ షుగర్ అండ్ కేన్ కమిషనర్ వెంకట్రావు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. రవిచంద్రన్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఆస్తుల వివరాలతో పాటు నష్ట అంచనాలను పకడ్బందీగా నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



కబడ్డీ విజేత గీతాంజలి జట్టు



వాలీబాల్ విజేత సిద్ధార్థ కళాశాల జట్టు



ఓవరాల్ చాంపియన్ షిప్‌ను అందుకుంటున్న ఎన్‌బీకేఆర్ క్రీడాకారులు

- ముగిసిన జేఎన్‌టీయూఏ అంతర కళాశాలల గేమ్స్‌మీట్
- ఓవరాల్ చాంపియన్ ఎన్‌బీకేఆర్ విద్యానగర్
- జేఎన్‌టీయూఏ వీసీ రంగ జనార్దన్

గూడూరు రూరల్: విద్యతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే తమలోని నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవచ్చని వచ్చని జేఎన్‌టీయూ అనంతపురం వైస్ చాన్సలర్ రంగజనార్దన్ తెలిపారు. గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా జరిగిన యూనివర్సిటీ 11వ అంతర కళాశాలల గేమ్స్‌మీట్ సోమవారం అట్టహాసంగా ముగిసింది. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి వీసీ రంగ జనార్దన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఈ గేమ్స్ మీట్‌లో 48 కళాశాలలకు చెందిన 1,747 మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో తిరుపతి జిల్లా విద్యానగర్‌కు చెందిన ఎన్‌బీకేఆర్ కళాశాల ఓవరాల్ చాంపియన్‌గా నిలవడం అభినందనీయమన్నారు. 1,155 మంది బాలురు, 592 మంది బాలికలు క్రీడాపోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో మహిళా రిజర్వేషన్ ప్రకారం బాలురతో సమానంగా బాలికలు క్రీడాపోటీల్లో పాల్గొనేలా ఆయ కళాశాలల పీడీలు శ్రద్ధ వహించాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏ.మోహన్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సాధారణమని, పాల్గొనడం ముఖ్యమన్నారు. ఎంతోమంది క్రీడాకారులు వారిలో ఉండే నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరి బీ.జోజిరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ధనుంజయ, వేణుమాధవ్, ఏటి రామయ్య, పీడీ రవిచంద్ర పాల్గొన్నారు.

విజేతలు వీరే..

బాలుర విభాగంలో వాలీబాల్ పోటీల్లో సిద్ధార్థ కళాశాల(పుత్తూరు), బాస్కెట్‌లో బాల్‌లో మిట్స్ కళాశాల(మదనపల్లి), బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ఆదిశంకర (గూడూరు), డబుల్స్, టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ఎన్‌బీకేఆర్ (విద్యానగర్). టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో జేఎన్‌టీయూ అనంతపురం విజేతగా నిలిచాయి. కబడ్డీలో గీతాంజలి(నెల్లూరు) విన్నర్‌గా, ఎస్వీ కాలేజీ(తిరుపతి) రన్నర్స్‌గా గెలిచాయి. బాల్ బ్యాడ్మింటన్‌లో ఎన్‌బీకేఆర్ (విద్యానగర్), హ్యాండ్ బాల్ పోటీల్లో వేము ఐటీ(చిత్తూరు) విన్నర్‌గా నిలిచాయి.

బాలికల విభాగంలో...

వాలీబాల్ పోటీల్లో ఎస్వీ.కాలేజ్(తిరుపతి), బాస్కెట్‌బాల్‌లో ఆర్‌జీఎం(నంద్యాల), బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో అన్నమాచార్య(తిరుపతి), డబుల్స్‌లో అన్నమాచార్య(తిరుపతి), టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో నారాయణ(నెల్లూరు), డబుల్స్‌లో జేఎన్‌టీయూ (అనంతపురం), త్రోబాల్‌లో జేఎన్‌టీయూ(పులివెందుల), టెన్నికాయిట్ సింగిల్స్, డబుల్స్‌లో మిట్స్ (మదనపల్లి), బాల్ బ్యాడ్మింటన్‌లో ఎన్‌బీకేఆర్.(విద్యానగర్) విన్నర్స్‌గా నిలిచాయి.

ఉద్యోగానికొచ్చి..కానరాని లోకాలకు

- బావిలో గల్లంతైన యువకుడి మృతి
- ఈత వచ్చినా గల్లంతవ్వడమేంటి?
- అనుమానం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు



నాగరాజు మృతదేహం



నాగరాజు (ఫైల్)



యువకుడు మృతి చెందిన బావి వద్ద గుమ్మికూడిన జనం

వరదయ్యపాళెం: ఉద్యోగం కోసం వచ్చి ఓ యువకుడు బావిలో పడి దుర్మరణం చెందిన ఘటన మండలంలోని పాండూరు హైస్కూల్ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగార్జునరెడ్డి కథనం.. వెంకటగిరి నియోజకవర్గం, బాలాయపల్లి మండలం, కడవగుంట గ్రామానికి చెందిన మావుడూరు మోహన్ కుమారుడు ఎం.నాగరాజు (20) ఐటీఐ పూర్తి చేసుకుని 10 రోజుల పాటు శ్రీసిటీలోని హీరో పరిశ్రమలో ఉద్యోగం చేశాడు. అయితే అక్కడ ఉద్యోగ గడువు పూర్తవడంతో నెల రోజులుగా ఖాళీగా ఉన్నాడు. చిన్న పాండూరు సమీపంలోని వీకేఆర్‌వై కాలనీ వద్ద తన స్నేహితులతో కలిసి అద్దె గదిలో నివాసముంటున్నాడు. వారం రోజుల క్రితం వ్యక్తిగత పనుల నిమిత్తం సొంతూరుకెళ్లాడు. శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో ఉద్యోగం కోసం ఇంటర్వ్యూ ఉండడంతో ఈ నెల 4వ తేదీన మళ్లీ తను నివాసముంటున్న చిన్నపాండూరుకు చేరుకుని ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి పాండూరు హైస్కూల్ సమీపంలోని వ్యవసాయ బావి వద్ద ఈతకు వెళ్లారు. ఈత కొడుతూ నాగరాజు గల్లంతయ్యాడు. రాత్రి 10 గంటల వరకు గాలింపు చర్యలు చేపట్టినా యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మరోసారి సోమవారం ఉదయం మూడు ట్రాక్టర్ ఇంజిన్ల ద్వారా నీటిని బయటకు తోడడంతో బావి లోపల ఉన్న పిల్ల బావి పూడికలో నాగరాజు మృతదేహం ఉండడాన్ని గుర్తించి బయటకు తీశారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం సత్యవేడు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అంతా అనుమానమే

నాగరాజు మృతి ఘటన అంతా అనుమానంగా ఉందని, స్థానికులు, కుటుంబ సభ్యులు ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుని ముఖంపై, నోరు, కంటి వద్ద రక్త గాయాలు ఉండడం పలు అనుమానాలకు దారితీస్తోంది. ఈత తెలిసిన నాగరాజు బావిలో గల్లంతవ్వడానికి కారణాలు ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. పోలీసులు ఆ దిశగా విచారణ చేపడుతున్నట్టు తెలుస్తోంది.

దుఃఖసాగరంలో కుటుంబ సభ్యులు

ఉద్యోగం కోసం వచ్చి ఉన్న ఒక్కగానొక్క కొడుకు దూరమయ్యాడంటూ కుటుంబ సభ్యులు రోదించడం స్థానికులను కలచివేసింది. కుమారుడి మరణవార్త విన్న కుటుంబ సభ్యులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. వారి రోదన వర్ణనాతీతంగా మారింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన దేవకుమార్

తిరుచానూరు (చంద్రగిరి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలోని పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి కలెక్టరేట్ సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం, అవిలాలకు చెందిన సుబ్రమణ్యం, అతని కుమారుడు దేవకుమార్(35) వ్యక్తిగత పనులను ముగించుకుని ద్విచక్ర వాహనంలో రేణిగుంట నుంచి తిరుపతికి వస్తున్నారు. కలెక్టరేట్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో దేవకుమార్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సుబ్రమణ్యం గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న తిరుచానూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. దేవకుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

12న పోలింగ్ సామగ్రి పంపిణీ



శ్రీపద్మావతి డిగ్రీ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

తిరుపతి మంగళం : తిరుపతి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సామగ్రిని ఈనెల 12న పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం శ్రీపద్మావతి డిగ్రీ కళాశాల పీజీ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన తిరుపతి డివిజన్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌ను నగరపాలక కమిషనర్ అనుపమ అంజలి, ఆర్డీఓ కనకనరసారెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 12న ఉదయం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద పోలింగ్‌కు సంబంధించిన మార్క్‌డ్ ఓటర్ లిస్టు, పోలింగ్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ ఇతర సామగ్రిని తీసుకోవాల్సి ఉంటుందన్నారు. 13న పోలింగ్ సందర్భంగా కేంద్రాల్లో వసతుల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, ఓటరు స్లిప్‌ల పంపిణీ 50 శాతం మేరకు జరిగిందని, మిగిలినవి కూడా త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. కలెక్టర్ వెంట తిరుపతి అర్బన్ తహసీల్దార్, ఏఈఆర్‌ఓ వెంకటరమణ, నగరపాలక డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

నాణ్యమైన వైద్యప్రమాణాలే లక్ష్యం



సమావేశంలో సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : జిల్లాలోని అన్ని ప్రజారోగ్య ఆస్పత్రుల్లో నాణ్యతతో కూడిన ఆరోగ్య సంరక్షణ, మెరుగైన వైద్యం అందించడమే ప్రాథమిక లక్ష్యంగా సేవలందించాలని కలెక్టర్, జిల్లా స్థాయి నాణ్యత హామీ కమిటీ చైర్మన్ కె వెంకటరమణారెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్యశాఖ ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి నాణ్యత హామీ కమిటీ తొలి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 58 పీహెచ్‌సీలలో 24 ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ పొందాయని తెలిపారు. ఇందులో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి శ్రీకాళహస్తి, పుత్తూరు సీహెచ్‌సీ, చంద్రగిరి సదరు సర్టిఫికెట్ పొందాయని తెలిపారు. రుయా సూపరింటెండెంట్ నాగమునీంద్రుడు, పార్థసారథి, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ అరుణసులోచనాదేవి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రభావతమ్మ, గూడూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధారాణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి శాంత కుమారి, నాణ్యత పర్యవేక్షణ కన్సల్టెంట్ శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ



గుడిమల్లంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ శేఖర్

ఏర్పేడు: మండలంలోని పలు పాఠశాలలను డీఈఓ శేఖర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, రికార్డులను పరిశీలించారు. పాపానాయుడుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఇక్కడి 8వ తరగతి విద్యార్థులు, వికృతమాల ప్రాథమిక పాఠశాలలో 4, 5 తరగతుల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే గుడిమల్లం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు జయకుమార్‌రెడ్డి ఉన్నారు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ



స్వర్ణా లేఅవుట్‌లో తాళం వేసిన ఇంటిని గుర్తించే పనిలో నిందితుడు



ఇంట్లోకి ప్రవేశిస్తున్న దొంగలు

- రూ.22లక్షల విలువైన సొత్తు అపహరణ
- సీసీ ఫుటేజీలో నిందితుల దృశ్యాలు

పుత్తూరు రూరల్ : పట్టణంలోని స్వర్ణ లేఅవుట్‌లో ఉన్న ఓ ఇంట్లో ఇద్దరు దుండగులు చోరీకి పాల్పడ్డారు. సీసీ కెమెరాల నిఘా ఉన్నా మాస్కులు, మంకీ క్యాప్ ధరించి దర్జాగా దోచుకెళ్లారు. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు.. ట్రాన్స్‌కో ఏఈలుగా పనిచేస్తున్న టి.మోనీష్‌కుమార్, నీతూసింగ్ దంపతులు శనివారం సాయంత్రం పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు సొంత పని నిమిత్తం వెళ్లారు. అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై స్వర్ణా లేఅవుట్‌లోకి వచ్చారు. ఒక వ్యక్తి దిగి నడుచుకుంటూ తాళం వేసిన ఇంటిని గుర్తించాడు. అతడి ముఖం సీసీ కెమెరాలో స్పష్టంగా కనిపిస్తోంది. మళ్లీ రాత్రి 12.30 గంటలకు ఇద్దరూ మంకీ క్యాప్‌లు ధరించి ఎంపిక చేసుకున్న ఇంటి వద్దకు చేరుకుని తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలోని 560 గ్రాముల బంగారు నగలు, రెండున్నర కేజీల వెండి వస్తువులు, రూ.1.90లక్షల నగదు అపహరించారు. రాత్రి 1.11 గంటలకు దుండగులు ఇంట్లో నుంచి బయటకు వస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. చోరీ జరిగిన విషయాన్ని సోమవారం అదే ఇంటి మిద్దెపైన నివసిస్తున్న వ్యక్తి గుర్తించారు. వెంటనే ఇంటి యజమానికి సమాచారం అందించారు. దీంతో ఏఈ దంపతులు సోమవారం సాయంత్రం పుత్తూరుకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ.22లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ స్వర్ణా లేఅవుట్‌లోనే ఆరు నెలల వ్యవధిలో ఇది మూడో దొంగతనం జరగడం గమనార్హం. ఈ కాలనీలోనే సీఐ, ఎస్‌ఐ, మరో కానిస్టేబుల్ నివాసాలు ఉండడం కొసమెరుపు.